క్లుప్తంగా

యువత భాగస్వాములు కావాలి



జ్వరాలపై ఆరా తీస్తున్న డీపీవో సౌజన్య భార్గవి

జి.సిగడాం: గ్రామాల పారిశుద్ధ్య పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భార్గవి పిలుపునిచ్చారు. మండలంలోని టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలపై బుధవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటా సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామ పారిశుద్ధ్యం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. టంకాల దిగ్గువలస పంచాయతీలో నిధులు లేకపోతే మండల పరిషత్ నుంచి నిధులు తెప్పించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. జ్వరాలు అదుపులోకి వచ్చేవరకు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆమెతో పాటు ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, వైద్యాధికారి డాక్టర్ బుడుమూరు యశ్వంత్, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య తదితరులు ఉన్నారు.

గుర్తింపు కార్డులు జారీ చేస్తాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని వీధి విక్రయదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేపై బుధవారం సమీక్ష నిర్వహించారు. వీధి విక్రయదారుల సర్వే పూర్తయిన అనంతరం నగరపాలక సంస్థ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. వీధి విక్రయదారులు నగరపాలక సంస్థతో అమోదించబడిన వెండింగ్ జోన్లలో మాత్రమే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో నగరపాలక వీధి విక్రయ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డా.ధీరజ్

శ్రీకాకుళం అర్బన్: క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన అవసరమని అంకాలజిస్ట్ కె.ధీరజ్ అన్నారు. నగరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ కణాలు శరీరంలో ఎక్కడికైనా వ్యాపించి ఉండవచ్చని, అయితే దాని మూలాలు ఎక్కడ ఉన్నాయో కనుక్కోవడం కష్టమన్నారు. తల, మెడ, నోరు, గొంతు, చెవి వెనుక భాగం, ముక్కు ఇతర భాగాలను ప్రభావితం చేసే అనేక రకాల క్యాన్సర్లు ఉంటాయన్నారు. ఈ క్యాన్సర్ అత్యంత సాధారణ లక్షణం నిరంతరం గొంతునొప్పి అని పేర్కొన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా దీని ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చన్నారు.

తెలుగు సాహిత్యానికి వెలుగు 'ఆరవెల్లి'



ఆరవెల్లికి నివాళులర్పిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు సాహిత్యానికి వెలుగు ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులని, సాహిత్య సంపదను కాపాడడం కోసం 30 ఏళ్లు కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆరవెల్లి 3వ వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మాట్లాడుతూ.. ఉపనిషన్మందిరం ఏర్పడి 75 ఏళ్లు కావస్తున్నా సాహిత్య సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిష్టల నరసింహమూర్తి, శరత్‌బాబు, బాబూరావు, మనోహర్, పట్నాయిక్, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ మార్పిడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయమందిస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఎచ్చెర్ల మండలంలోని మత్స్యలేశం గ్రామానికి చెందిన దుమ్ము రమేష్ కాలేయ మార్పిడి కోసం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి బుధవారం అందించింది. గత కొంత కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న రమేష్‌కు విశాఖలో వైద్యులు పరీక్షలు చేసి కాలేయ మార్పిడికి రూ.35 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయంతో పాటుగా నిత్యావసర సరుకులు కూడా బాధితులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో శింతు ఆటకేశం, పొడుగు చరణ్, కలివరపు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళం..!

- పీ–4 సర్వేపై తూతూమంత్రంగా సభలు
- తప్పులతడకగా సర్వేలు
- మార్గదర్శకుల గుర్తింపులో అధికారుల పాట్లు



కోటపాలెంలో గ్రామసభ (ఫైల్)



రణస్థలంలో ఇంటింటా సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

రణస్థలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్(పీ–4) విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది. గ్రామాల్లోని నిరుపేదలను ఆదుకుంటామంటూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం కూటమి నాయకులకే నవ్వులాటగా మారింది. ఇటీవల సీఎం చంద్రబాబు ఎచ్చెర్ల మండలంలోని బుడగట్లపాలెం వచ్చినప్పుడు పీ–4 విధానంలో కొన్ని కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు. అయితే ప్రస్తుతం ఎచ్చెర్ల నియోజకవర్గంలో బంగారు కుటుంబాల సర్వే తీరులో గందరగోళం నెలకొంది. గ్రామసభలు పెట్టి బంగారు కుటుంబాలు ఎంపిక చేయడంపై స్పష్టత లేకపోవడం వలన కార్యక్రమాలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. బంగారు కుటుంబాలు మార్గదర్శులు అనే పేరుతో నిర్వహించిన సర్వేలు తప్పుల తడకగా ఉన్నట్లు అధికారులు తాజాగా గుర్తించారు. బంగారు కుటుంబాల దత్తత తీసుకునే క్రమంలో చాలాచోట్ల పేదల స్థానంలో నచ్చినవారిని చేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 15వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాలను గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం గడువు ఇచ్చింది.

పారదర్శకత ఎక్కడ..?

బంగారు కుటుంబాల సర్వే సమగ్రంగా లేదని అధికారులు మరోసారి గుర్తించారు. సర్వే చేసే విధానం, అనుసరించాల్సిన పద్ధతులు, పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలపై గ్రామ సచివాలయ సిబ్బందికి ఆరు నెలల క్రితమే శిక్షణ ఇచ్చారు. సర్వేలో గుర్తించిన అంశాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అయితే ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, నచ్చినట్లు నమోదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బంగారు కుటుంబాలుగా నమోదు చేస్తే సంక్షేమ పథకాలు పోతాయనే బెంగ కూడా చాలామందిలో ఉంది. నిజంగా నిరుపేదలను గుర్తించి వాళ్లను ప్రోత్సహిస్తే మంచిదేనని విశ్లేషకుల మాట. కానీ ఆ దిశగా అడుగులు పడతాయా లేక అర్భాటలతో వదిలేస్తారా అనేది చూడాల్సి ఉంది.

అధికారులకు అవస్థలు

పీ–4లో నమోదు చేసిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకుల అన్వేషణ అధికారులకు కత్తిమీద సాములా ఉంది. మార్గదర్శుల గుర్తింపు ప్రక్రియ కూడా కూటమిలో ఉన్న నాయకులనే చేర్చుతున్నారనే విమర్శ ఉంది. గ్రామ సభలు పెట్టిన సమయంలో ఆ నాయకులే మార్గదర్శుల పేర్ల ఎంపికపై నవ్వుకుంటుండడం కొసమెరుపు. ప్రభుత్వ యంత్రాంగ అంతా అన్నీ శాఖలను అప్రమత్తం చేసి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులను గుర్తించే పనిలో తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో నమోదు చేసిన వివరాలు (ఇప్పటివరకు..)

మండలం	బంగారు కుటుంబాలు	దత్తత కుటుంబాలు	మార్గదర్శులు
రణస్థలం	3057	386	111
ఎచ్చెర్ల	2356	502	251
జి.సిగడాం	2923	1039	188
లావేరు	2688	895	196
మొత్తంగా	11,024	2,822	746

ప్రక్రియ కొనసాగుతోంది

నియోజకవర్గంలో ఇప్పటివరకు 11,024 బంగారు కుటుంబాలను గుర్తించాము. అందులో మార్గదర్శులను అనుసరించి దత్తత తీసుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఆగస్టు 15 వరకు గడువు ఉంది. ఈలోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– పి.సుగణాకరరావు, విజన్ యాక్షన్ స్పెషల్ అధికారి, ఎచ్చెర్ల నియోజకవర్గ

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



జి.సిగడాం: దేవరవలసలో రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఏడాది కూటమి పాలనలో హామీలను అమలు చేయని సీఎం చంద్రబాబు మోసాలను గ్రామాల్లోని ప్రజలకు వివరిద్దామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ పిలుపునిచ్చారు. మండలంలోని దేవరవలస గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువత, ఆడబిడ్డలు, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుమరెడ్డి విజయలక్ష్మి, నాయకులు తిరుమరెడ్డి లక్ష్మణరావు, జనపాల ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలకు బుద్ధి చెప్పాలి



బొంతలకోడూరులో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



కొంగరాంలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని ఎచ్చెర్ల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోర సాయిరాం పిలుపునిచ్చారు. మండలంలోని తోటపాలేం, కొంగరాం, పొన్నాడ, బొంతలకోడూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, వైస్ ఎంపీపీ జరుగుళ్ల శంకరరావు, నేతింటి నీలమప్పడు, రవి, ఎస్ఎస్ఆర్‌పురం సర్పంచ్ దుంప చిన్నారెడ్డి, బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి గవిరెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



చెరువు గట్టుపై పాకలను పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: జిల్లాలో ఎవరైనా సాగునీటి చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. మండలంలోని నక్కపేట గ్రామానికి చెందిన పలువురు మూగజీవాల కోసం చెరువు గట్టుపై పాకలు నిర్మించుకొని ఉండడంపై కొంతమంది రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం చెరువును జేసీ సందర్శించారు. అయితే తాము చెరువులను ఆక్రమించలేదని, ఎన్నో ఏళ్లుగా మూగజీవాలను పాకలు వేసి కాపాడుకుంటున్నామని గ్రామస్తులు తెలియజేశారు. చెరువు గట్టుపై ఉన్న పాకలను తొలగిస్తే తమకు మరోచోట అయినా స్థలం ఇప్పించాలని విన్నవించారు. దీనిపై జేసీ మాట్లాడుతూ.. సాగునీటి చెరువులపై ప్రజలు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామస్తులంతా ఐక్యమత్యంతో మెలగాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ మహాదేవు సరిత, సర్పంచ్ గేదెల మల్లిబాబు, ఆర్ఐ అబోతుల రాధ, వీఆర్వో బోర ఎరకయ్య, సర్వేయర్లు పావని, సాయి తదితరులు ఉన్నారు.

ఆర్టీఐతో పారదర్శక సమాచారం



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ

శ్రీకాకుళం అర్బన్: ప్రజలకు పారదర్శకంగా సమాచారాన్ని అందించడంలో ఆర్‌టీఐ చట్టం–2005 కీలక భూమిక పోషిస్తోందని జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఆర్‌టీఐపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు సమయానుకూలంగా, సక్రమమైన సమాచారం అందించడమే సహకార విభాగం లక్ష్యమన్నారు. అలాగే అధికారులు ఆర్‌టీఐ చట్టంలోని నిబంధనలు, సమాచార హక్కు వినియోగ విధానం, పీఐఓల బాధ్యతలు, సమాచారాన్ని నిర్దిష్ట గడువులో అందించాల్సిన అవసరాన్ని వివరిస్తూ పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు. సదస్సులో డివిజనల్ సహకార అధికారులు (శ్రీకాకుళం, టెక్కలి), జిల్లా సహకార ఆడిట్ అధికారి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ పీఐఓలు, ఏపీఐఓలు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని గొర్లెపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి అప్పలస్వామి కుమారుడు మహంతి సంతోష్ సంతాప సభలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం పాల్గొని నివాళులర్పించారు. ఆయనతో పాటు రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, జేసీఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, సర్పంచులు మహంతి అప్పలనాయుడు, గొర్లె అప్పలనాయుడు, నాయకుడు దన్నాన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఔదార్యానికి అభినందనలు



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: నాగార్జున అగ్రికమ్ ఉద్యోగులు, కార్మికుల ఔదార్యానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీఆర్ శ్రీనివాస్, కె.శ్యాంప్రసాద్‌లు అభినందనలు తెలిపారు. అగ్రికమ్ పరిశ్రమలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన గొర్లె చిట్టిబాబు, బోనంగి భాస్కరరావుల కుటుంబ సభ్యులకు బుధవారం తమ ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా కార్మికులు అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కార్మికులు తోటి కార్మికులు చనిపోతే ఇటువంటి సాయం అందించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎల్.చిరంజీవి, సీహెచ్ సత్యానారాయణ, పరుశురాం, పి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



జి.సిగడాం: పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుర్చీలు అందజేస్తున్న సూర్యనారాయణ కుటుంబ సభ్యులు

జి.సిగడాం: మండలంలోని సీతంపేట యూపీ పాఠశాలకు కంప్యూటర్, ఇతర సామాగ్రిని శ్రీకాకుళం మండలం కనుగులవానిపేట గ్రామానికి చెందిన ఇప్పిలి చంద్రశేఖర్, కుసుమ కుమారి దంపతులు కలిసి బుధవారం హెచ్ఎం అన్నెపు లక్ష్మణరావుకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జడ్డు జగదేశ్వరరావు, పంచాది రవికుమార్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టణంలోని శిష్టకరణ సామాజిక భవనానికి 20 కుర్చీలను పాతపట్నంకు చెందిన దివంగత సూర్యనారాయణ పట్నాయక్ 5వ వర్ధంతి పురస్కరించుకొని అతని భార్య లలిత కుమారి, కుమారుడు జిల్లా శిష్టకరణ సంఘ జాయింట్ సెక్రటరీ బాలకృష్ణ పట్నాయక్‌లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాస్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ, ఎస్‌వీడీ మురళి, మోహన్, సత్యనారాయణ, పరమానంద దళయ్, రామకృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



లక్ష్మణరావును అభినందిస్తున్న కృష్ణదాస్

ఎచ్చెర్ల: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను అతని స్వగృహంలో లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పెయ్యిల లక్ష్మణరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కృష్ణదాస్ ఆయనకు సూచించారు. పార్టీ కోసం కష్టపడినవారికి పదవులు ఉంటాయన్నారు.

ముగిసిన జేసీ కన్సల్టెన్సీ పరిశీలన

ఎచ్చెర్ల: ఐఎస్‌వో గ్రీన్ ఆడిట్ కోసం జేసీ కన్సల్టెన్సీ సర్వీసెస్ (గోరఖ్‌పూర్, ఉత్తరప్రదేశ్) బీఆర్ఏయూలో రెండు రోజుల పాటు చేసిన ఆకడమిక్ పరిశీలన బుధవారంతో ముగిసింది. రెండోరోజు కూడా వర్సిటీ గ్రంథాలయం, హాస్టల్, ఇంజినీరింగ్ కార్యాలయాలు, క్రీడా వసతుల సముదాయం, కామర్స్ విభాగం తదితరవాటిని సందర్శించారు. వారితో పాటు వీసీ కేఆర్ రజనీ, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

రణస్థలం: పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని లావేరు పశువైద్యాధికారి గాయత్రి సూచించారు. మండలంలోని లావేరు గ్రామంలో 150 పశువులకు లంపీస్కిన్ వ్యాధి రాకుండా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల శరీరమంతా కణతలతో ఉండి ఆరోగ్యం క్షీణిస్తుందని, పాడి రైతులు అశ్రద్ధ చేయకూడదని సూచించారు. ఈ టీకాలు జూలై 31 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఓఎస్ మామిడి జగదీష్, సిబ్బంది నాగరాజు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

రణస్థలం: మండలంలో జేఆర్‌పురం బ్రాహ్మణవీధిలోని కల్యాణి కంటి పరీక్షా కేంద్రంలో కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించినట్లు నిర్వాహకురాలు ఎస్.కల్యాణి తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు 12 మందిని శస్త్ర చికిత్సకు బస్సులో తరలించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల: మండలంలోని ఎచ్చెర్ల ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీఎంఐ పనులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ యోగీశ్వరరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ, కొత్తపేట, వెంకటన్నగారిపేట, తెప్పరేవు, సెగిడిపేట, ఎచ్చెర్ల, లింగాలపేట, ట్రిపుల్ ఐటీ కళాశాల, అనమిత్ర టౌన్‌షిప్‌లతో పాటు మాలముద్దాడ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మోసం చంద్రబాబు నైజం



బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీలో ప్రచారం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మోసం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు దుయ్యబట్టారు. మండల పరిధిలోని బైరివానిపేట గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఇన్‌చార్జిలు పాలవలస రామారావు, చిట్టి లక్ష్మణరావు సమక్షంలో చంద్రబాబు బూటకపు హామీలను వివరించారు. చంద్రబాబు మాయమాటలు నమ్మరాదంటూ గ్రామంలో పెద్ద ఎత్తున నినాదాలు తీశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గేదెల పురుషోత్తం, మూకళ్ల తాతబాబు, కుంచాల భాస్కర్, ఎచ్చెర్ల శ్రీధర్, కుంచాల సురేష్, బోర నర్సునాయుడు, పాలవలస రామారావు, పొన్నాడ రామారావు, బగ్గు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలన మోసాలమయం



అంపోలులో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



కె.సైరిగాంలో చంద్రబాబు బూటకపు హామీలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు

గార: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలమయమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మండలంలోని కె.సైరిగాం, నిజామాబాద్ పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ఇంతవరకు అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు రమణ, గంగు రామారావు, ఎంపీటీసీ అంబటి ప్రమీలకుమారి, అరవల రామకృష్ణ, శిమ్మ ధర్మరాజు, యాళ్ల నారాయణమూర్తి, శ్రీకూర్మం సర్పంచ్ గోరు అనిత, గొలివి వెంకటరమణమూర్తి, రౌతు శంకరరావు, బరాటం నాగరాజు, వమరవల్లి ఉదయ భాస్కరరావు, శీర సత్యం, ఆరంగి సూర్య, ఆరంగి మణి, మార్పు రవి, దుప్పట్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

అంపోలులో...

అమలు చేయలేమని తెలిసినా కూటమి నాయకులు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అంపోలు పంచాయతీ చల్లపేట, లింగాలవలస గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు జయరాం, ఎంపీటీసీ పాదిలాపు రామజోగి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అంధవరపు బాలకృష్ణమూర్తి, తమ్మిన అప్పలరాజు, కొయ్యాన నాగభూషణం, సుంకాన సురేష్, పుక్కళ్ల చంటి, గురువు అప్పలనాయుడు, గొండు భరత్, చల్ల మల్లేసు, చల్ల శేఖర్, సావాడ ప్రకాష్, శిమ్మ జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.